
"సార్...టీ" అన్న పిలుపుతో ఫైల్ మూసి, టీ అందుకుని సిప్ చేసి ప్రక్కకు తిరిగి విశ్వనాథం సీటు వైపు చూసాను. ఇంకా ఆ వృద్ధుడు విశ్వనాథాన్ని బ్రతిమాలుతూనే ఉన్నాడు. నెల రోజులుగా తన పెన్షన్ ఫైల్ విషయంలో పరిష్కారం కోసం పట్టువదలని విక్కమార్కుడిలా చుట్టూ తిరుగుతూనే ఉన్నా విశ్వనాథం మాత్రం కరగడం లేదు. నాకు తెలుసు! కాసులు పడేవరకు... కరగడని. ఆ వృద్ధుడ్ని చూస్తుంటే జాలి కలిగింది. అయినా ఏమీ చేయలేని పరిస్థితి. ఇటువంటి విషయాల్లో విశ్వనాథం ఎవరిమాటా వినడని నాకు అనుభవపూర్వకంగా తెలుసు. టీ త్రాగడం పూర్తి కావడంతో గ్లాసు పక్కన బెట్టి, సిగరెట్ కోసం బయటకు నడిచాను.

# అతనిలో... నేను

–కోటిపల్లి తారక రామారావు




# కథ

క్యాంటీన్ దగ్గరకు వెళ్ళి సిగరెట్ కాలుస్తూ నిల్చున్నాను. ఆ వృద్ధుడే గుర్తొచ్చాడు. డెబ్బై ఏళ్ళుంటాయేమో అతనికి.. సన్నగా, పొట్టిగా, లోపలకు పోయిన కళ్ళతో... కష్టం అనే మాటకు పర్యాయపదంలా ఉన్న అతన్ని చూస్తే ఎవరికైనా జాలి కలుగుతుంది. విశ్వనాధంకు మాత్రం ఇవేమీ పట్టవు., ఎలాంటి వాళ్ళయినా పనుందంటూ తన దగ్గరకు వస్తే వాళ్ళను జలగలా పీల్చేంతవరకు వదలడు. అతని సంగతి ఆఫీస్‌లో అందరకీ తెలిసినా పై స్థాయిలో అతనికున్న పలుకుబడిని చూసి భయంతో కొందరు, మనకెందుకులే అనే నిర్లిప్తతతో మరికొందరు అతని గురించి పట్టించుకోరు... నాలాగే!

కాల్చిన సిగరెట్ క్రిందపడేసి, ఆఫీస్ లోపలకు కదులుతుండగా.. టీ త్రాగడానికి వచ్చాడేమో.! ఆ ముసలాయన. ఇంకో కుర్రవాడితో కలసి నా ముందు నుండే లోనికి వెళ్ళిపోయారు. లోపలికి వెళ్ళి నా సీటులో కూర్చున్నాను. విచిత్రం.. విశ్వనాధం ఆ కుర్రవాడితో ''పది నిమిషాలలో చే సేస్తాను... మీరేం వర్రీ కాకుండా కూర్చోండి'' అంటూ అతన్ని తన ప్రక్కనే ఉన్న స్టూల్‌పై కూర్చోబెట్టాడు. ఆముసలాయన మాత్రం యధా విధిగా ''బాబూ... నీకు పుణ్యముంటుంది'' అంటూ బ్రతిమాలుతున్నాడు. ఇదేమీ పట్టనట్టుగా తన ముందరున్న ఫైల్స్‌లో దేని కోసమో తెగవెతుకుతున్నాడు విశ్వనాధం. నాకతన్ని చూస్తుంటే అసహ్యం కలిగింది. నెలరోజులుగా తన చుట్టూ తిరుగుతున్న ఆ వృద్ధుడి గురించి కనీసం పట్టించుకోకుండా, ఇపుడే వచ్చిన ఆ కుర్రవాడిచ్చే డబ్బులు కోసం కక్కుర్తి పడుతున్న అతన్ని చూసి. ఇంతలో ఆ ముసలాయన ఒక నిశ్చయానికొచ్చినట్టుగా ''బాబూ... ఆఖరుమాట. మూడొందలు ఇస్తాను.. నాపనిచేసెయ్'' ఆశగా అన్నాడు. ఆమాట విని తలెత్తి ''ఇదేం కూరగాయల బేరమా? వెయ్యికి ఒక్కపైసా తగ్గినా, నీ పని పూర్తికాదు. ఇవ్వాళ తప్పితే.. మళ్ళీ పదిరోజుల వరకు నేనుండను.., చూసుకో!'' అన్నాడు విశ్వనాధం. ''వెయ్యి రూపాయిలిస్తేగాని.. నా పని చేయనంటావు. అంతేనా?'' కోపంగా అడిగాడా ముసలాయన. ''ఏంటి అరుస్తున్నావు. ఒక్కసారి కాదు.. వందసార్లు చెబుతా, వెయ్యి రూపాయలు ఇస్తేనే చేస్తాను. లేకపోతే చేయను. ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకోపో..'' అంటూ కసిరిన విశ్వనాధాన్ని చూస్తూ ''ఎవరికి చెప్పాలో వాళ్ళకే చెబుతా, నీపై ఆఫీసర్‌కు నీమీద ఫిర్యాదు చేస్తా. ఎలా నా పని కాదో నేనూ చూస్తా'' అంటున్నాడా ముసలాయన.

విశ్వనాధం ఒక్కసారిగా పైకిలేచి కోపంగా ముసలాయన మెడపై చెయ్యేసి ''నీ దిక్కున్న చోట చెప్పుకోపో'' అంటూ విసురుగా అవతలకి నెట్టేసాడు. ఆ అదురుకి ఆముసలాయన వెళ్ళి నేలపై పడడం, పెదవి చిట్లి రక్తం రావడం.. చూస్తున్న మాకు అర్ధమయ్యేంతలోగా చాలా వేగవంతగా జరిగిపోయింది. నేను ఉలిక్కిపడ్డాను. వెంటనే తేరుకుని పరుగు పరుగున వెళ్ళి ఆముసలాయన్ని పైకి లేపి విశ్వనాధం వైపు చూస్తూ ఏదో అనబోయేంతలో... అంతవరకూ జరుగుతున్న విషయాలతో తనకే మీ సంబంధం లేనట్టుగా సెల్‌ఫోన్ పట్టుకుని ఏవేవో బటన్స్ నొక్కుతూ కూర్చున్న ఆ యువకుడు లేచి నిల్చొని, కుడి చేయి పిడికిలి బిగించి చాచిపెట్టి విశ్వనాధం చెంపపై కొట్టాడు.

ఊహించని ఆ దెబ్బకు విశ్వ నాధం వెళ్ళ నా టేబుల్ దగ్గర పడ్డాడు.



చూస్తున్న మేమంతా అవాక్కయి పోయాము. ఆ కుర్రాడు మాత్రం తాపీగా విశ్వనాథం దగ్గరకు వెళ్ళి చొక్కా కాలర్ పట్టుకుని లేపి "ఇచ్చింది సరిపోతుందనుకుంటే... ఆ పెద్దాయన పెన్షన్ వెంటనే క్లియర్ చెయ్, లేదూ... ఇంకా కావాలంటే చెప్పు" అని అతన్ని సీట్లో కూలదోసి ఎదురుగా ఉన్న సీట్లో కూర్చున్నాడు. విశ్వనాథం ముఖంలో రక్తపు చుక్కలేదు! మనిషి గజగజ వణికిపోతున్నాడు. తన ఇన్నేళ్ళ సర్వీస్‌లో ఇలా జరగడం ఇదే మొదటిసారి కావచ్చు. నిజం చెప్పొద్దూ!! నాకు చాలా సంతోషంగా అనిపించింది. ఆ వృద్ధుడి పట్ల అంత క్రూరంగా ప్రవర్తించిన విశ్వనాధానికి తగినశాస్తి చేసిన ఆ కుర్రవాడి ధైర్యాన్ని మనస్ఫూర్తిగా లోలోనే మెచ్చుకున్నాను.

జరుగుతున్న సంఘటనలన్నీ అవాక్కయి చూస్తూ బొమ్మల్లా నిల్చొన్న మా ఆఫీస్ స్టాఫ్‌లో కదలిక వచ్చింది. ఒక్కొక్కరు ఒక్కోలా మాట్లాడుతున్నారు. "విశ్వనాథం ఎంత తప్పుచేస్తే మాత్రం, నువ్వు కొట్టడమేంటి? ప్రభుత్వ కార్యాలయంలో ప్రభుత్వోద్యోగిని కొట్టడం హీరోయిజం అనుకుంటున్నావా? ఇప్పుడే నీ మీద పోలీస్ కంప్లైంట్ ఇస్తాను, నీ అంతు చూస్తాను! ఏమనుకుంటున్నావో..!" అంటూ ఫోన్ దగ్గరకు కదిలాడు మా హెడ్‌క్లర్క్. ఆమాటలతో విశ్వనాథం కూడా ఊపిరి పీల్చుకుని కుర్చీలోంచి లేచి ఫోన్ దగ్గరకు వెళ్ళబోయాడు. ఇంత జరుగుతున్నా ఆ కుర్రవాడు మాత్రం చాలా ధీమాగా లేచి అందరి వైపు చూస్తూ "సరే, మీ ఇష్టం, మీరు పోలీసులను పిలిస్తే... నేను టి.వి. ఛానల్స్‌ను పిలిచి ఇదిగో నేను రికార్డ్ చేసిన ఈ వీడియో చూపిస్తాను. అప్పుడు చూద్దాం! ఏం జరుగుతుందో?" అంటూ తన సెల్‌ఫోన్‌లో రికార్డ్ చేసిన క్లిప్పింగ్ చూపిం చాడు. అంతే... ఒక్కసారిగా ఆఫీస్ అంతా నిశ్శబ్దం ఆవరించింది. విశ్వనాథం ఒళ్ళంతా చెమటలు! ఆ కుర్రవాడి కళ్ళల్లో గర్వంతో కూడిన చిరునవ్వు. నేను చప్పున ముందుకు కదిలి "చూడు.. జరిగిందేదో జరిగి పోయింది... ఆ ముసలాయన వర్క్ వెంటనే చేసి పంపేసేయ్. ఆ వీడియో టీ.వి.ల్లో ప్రసారం అయితే నీ ఉద్యోగమే కాదు నువ్వు కూడా ప్రమాదంలో పడ తావు" అని విశ్వనాథంకు చెప్పి, ఆ కుర్రవాడి వైపు తిరిగి "చూడు బాబూ.., ఈ విషయం ఇంతటితో వదిలేద్దాం! నీక్కావలసింది ఆ పెద్దాయన పెన్షన్ విషయమేగా.., అది కూడా వెంటనే చేసేస్తాం. నువ్వా రికార్డ్ చేసిన వీడియో డి లీట్ చేసెయ్!" అన్నాను. ఆ కుర్రవాడు తలపంకించి విశ్వనాథం ఇచ్చిన కాగితాలను తీసుకుని, రికార్డ్ చేసిన వీడియోని నా ముందే డిలీట్ చేసి చిన్నగా నవ్వుతూ... ఆ వృద్ధుడ్ని తీసుకుని వెళ్ళిపోయాడు.

పెద్ద గాలివాన వెలసినట్టుగా అనిపించింది. విశ్వనాథమైతే జరిగిన సంఘటనను జీర్ణించుకోలేక పోతున్నట్టున్నాడు. నిజమే, ఏళ్ళ కేళ్ళుగా నిర్మించుకున్న అవినీతి సామ్రాజ్యానికి బీటలు పడటంతో ఇంకా ఆ బాధలోనే ఉన్నాడు. నాకు మాత్రం ఆ కుర్రవాడి ప్రవర్తన సమంజసంగానే అనిపించింది. లంచం అడగాలంటే ఇక విశ్వనాథం వెనకా ముందూ ఆలోచిస్తాడు, ఇలాంటి పదిమంది కుర్రాళ్ళుంటే చాలా మంది లంచగొండి ఉద్యోగులకు గుణపాఠం వస్తుందని సంతోషించాను. ఆ కుర్రవాడు నేను చెప్పగానే బుద్ధిగా వీడియో డిలీట్ చేసి వెళ్ళిపోవడం నాకు చాలా ఆనందాన్నిచ్చింది. కానీ...

ఆ కుర్రవాడు ఈ విషయాన్ని వదిలేయలేదని, చాలా తీవ్రంగా తీసుకున్నాడని, మధ్యాహ్నం ఆ వీడియో ఒక ప్రముఖ న్యూస్ ఛానెల్‌లో ప్రసారమయ్యేంత వరకు అర్థంకాలేదు. కానీ అప్పటికే విశ్వనాథాన్ని సస్పెండ్ చేస్తూ, శాఖాపరమైన విచారణకు ఆదేశిస్తూ పై నుంచి ఆర్డర్స్ వచ్చాయి. విశ్వనాథంకు ఈ నిర్ణయం శరాఘాతంలా తగలడంతో నిలువునా కుప్ప కూలిపోయాడు. నాకు చాలా బాధ కలిగింది. విశ్వనాథం పై నాకున్న కోపమంతా ఈ సంఘటనతో ఆ కుర్రవాడిపై ద్వేషంగా మారింది. వీడియో డిలీట్ చేసానని చెప్పి నన్ను మోసం చేసి.. విశ్వనాథంకు ఇంత పెద్దశిక్ష వేసిన ఆ కుర్రవాడిని మాటతప్పినందుకు నిలదీయాలనుకున్నాను. కానీ, చాలా రోజుల వరకు అతను నాకు కనపడలేదు.

***

ఆ రోజు ఆదివారం. మా కొలీగ్ గృహప్రవేశానికి ఆహ్వానిస్తే వెళ్ళి భోజనం చేసి బస్టాప్‌లో బస్ కోసం నిల్చొన్నాను. బస్టాప్‌లో ప్రయాణికులు ఎక్కువగా లేరు. ఒక ప్రక్కగా ఇద్దరమ్మాయిలు నిల్చుని మాట్లాడుకుంటున్నారు. ఇంతలో ఎక్కడ్నుంచి వచ్చారోగాని, ముగ్గురు కుర్రాళ్ళు.. ఆ అమ్మాయిలను అల్లరిపెట్టడం ప్రారంభించారు. పాపం! ఆ ఆడపిల్లలిద్దరూ ఇబ్బందిగా చూస్తున్నారు. ఇంతలో వాళ్ళముగ్గురిలో ఒకడు ఒకమ్మాయి ఒంటిపై వున్న చున్నీని పట్టుకుని లాగుతున్నాడు. నాకు చాలా కోపమొచ్చింది. వాళ్ళకు బుద్ధి చెబుదామని ముందుకు కదిలేంతలో.., వేగంగా వచ్చి హఠాత్తుగా ఆగిందో మోటార్ బైక్. దాని వెనుక సీట్లోంచి దిగాడా కుర్రవాడు. దిగుతూనే దగ్గరకు వెళ్ళి ఆ ముగ్గురు కుర్రాళ్ళను పట్టుకుని కొట్టడం ప్రారంభించాడు. ఆ కుర్రాళ్ళు అప్పుడప్పుడే యవ్వనంలో అడుగు పెడుతున్నవాళ్ళు. తమకంటే వచ్చినవాడు వయసులోనే కాదు, బలంలో కూడా అధికుడని అర్థమయిన వెంటనే అక్కడి నుంచి గాబరాగా పారిపోయారు.

నాతో పాటు, ఆ అమ్మాయిలు కూడా కృతజ్ఞతా పూర్వకంగా ఆ అబ్బాయి వైపు చూసాము. కానీ అతనివేం పట్టించుకోకుండా బైక్ పై కూర్చుని "పోనీ...రా!" అంటూ నా వైపు తిరిగి చిన్నగా నవ్వాడు. నేను కూడా నవ్వబోయి ఉలిక్కిపడ్డాను.

ఈ కుర్రవాడే.!, విశ్వనాథం విషయంలో ఆ రోజు అంత అల్లరి చేసి.., అతని ఉద్యోగం పోవడానికి కారణమయినవాడు. నేను తేరుకుని ముందుకు కదిలేలోగా, ఆ కుర్రవాడితోపాటు ఆ బైక్ రివ్వున ముందుకు దూసుకెళ్ళిపోయింది. వెంటనే అప్రయత్నంగా 'రౌడీవెధవవ' అని మనసులో అనుకున్నాను. "ఆ ముగ్గురు కుర్రవాళ్ళు చేసింది తప్పైనప్పటికీ.., వాళ్ళని కొట్టే అధికారం వీడికెవరిచ్చారు?" అని చాలాసేపు మనసులో తిట్టుకుంటూనే ఉన్నానా కుర్రాడిని.


***

మా వీధి చివరుండే బ్యాంక్ మేనేజర్ గారికి ట్రాన్స్‌ఫర్ కావడంతో.., ఆ రోజు సాయంత్రం బార్‌లో పార్టీ ఏర్పాటు చేసారు. సాయంత్రం స్వయంగా ఆయనే వచ్చి పిలవడంతో త్రాగేవాళ్ళంటే నాకు సదభిప్రాయం లేకున్నా.., తప్పనిసరై వెళ్ళాల్సివచ్చింది. లోపల కూర్చుని మా దగ్గరకొచ్చిన వెయిటర్‌తో ఎవరెవరికి కావా ల్సినవి వారు చెబుతున్నారు. నేను సిగరెట్ తీసి వెలిగిం చుకుని యథాలాపంగా ప్రక్కకు చూసాను. గోల గోలగా మాట్లాడుతూ, "ఇంకా కావాలంటూ" అల్లరి చేస్తున్న స్నేహితుల్ని వారిస్తూ.., అక్కడ్నుంచి వాళ్ళను బయ టకు తీసుకువెళ్ళడానికి ప్రయత్నిస్తోన్న ఆ కుర్రవాడు నన్ను చూసి ఉలిక్కిపడి.., తరువాత సన్నగా నవ్వుతూ స్నేహితుల్తో కలసి నాముందునుండే వెళ్ళి పోయాడు. "వీడికీ అలవాటు కూడా ఉందన్నమాట" అని అను కుని," రౌడీ వెధవలకు ఉండని అలవాట్లేముంటాయి?" అని నాకు నేనే సమాధానం చెప్పుకున్నాను.

***

ప్రక్కగా స్కూటర్ స్టాండ్ వేసి, ఇంటివైపు చూసాను. తలుపులు తెరిచి ఉన్నాయి. "మున్నీ.. స్కూల్ నుంచి వచ్చేసినట్టుంది!" అనుకుంటూ లోనికి వెళ్ళి ముందు గదుల్లో చూసాను. తను కనిపించలేదు. పెరట్లో.. ఉందేమో.!, అని అటువైపు చూస్తున్న నాకు, వంటగది లోంచి మాటలు వినబడటంతో అటువైపు నడిచాను.

"నో... నో.., నేను ముందే చెప్పానుగా!, మా నాన్నకు మీరు నచ్చితేనే.." అంటూ ఫోన్‌లో ఎవరితోనే మాట్లాడుతోన్న మున్నీ "ఎవరమ్మా?" అన్న నా ప్రశ్నకు ఉలిక్కిపడి నా వైపు చూసి కంగారుగా "నా ఫ్రెండ్ నాన్నా.!" అంది. నేను అక్కడి నుంచి వచ్చి సోఫాలో కూర్చున్నాను. మున్నీ కళ్ళలో బెదురు, మాటల్లో కంగారు, నాలో ఎక్కడో చిన్న అనుమానాన్ని కలిగిస్తున్నాయి. ఇంతలో రెండుగ్లాసుల్లో టీ తీసుకుని వచ్చి, ఒక గ్లాస్ నాకిచ్చి.., ఇంకో గ్లాస్ పట్టుకుని నా ఎదురుగా కూర్చుని టీ త్రాగుతున్న మున్నీ వైపు తదేకంగా చూసి "ఎవరా అబ్బాయి?" అని మెల్లగా అడిగాను. తను బెదురుగా నా వైపు చూసి, తర్వాత మెల్లగా అంది.



''శ్రీరామ్ అని, మా స్కూల్ కరస్పాండెంట్ గారబ్బాయి.'' ''ఏం చేస్తున్నాడు?'' నా ప్రశ్నకు సమాధానంగా ''పి.జి. పూర్తయింది, ప్రస్తుతం స్కూల్ వ్యవహారాలన్నీ అతనే చూస్తున్నారు'' అని ఖాళీ గ్లాసులు తీసుకెళ్ళి వంటగదిలో పెట్టేసి వచ్చి నా ప్రక్కనే కూర్చుని మెల్లగా ''నేనంటే చాలా ఇష్టపడుతున్నారు., నేను సరేనంటే వాళ్ళింట్లో మాట్లాడుతామన్నారు. కానీ నేను మాత్రం ముందు మీకు చెప్పి, మీకతను నచ్చితేనే నాకతను నచ్చినట్లని చెప్పాను. అందుకు ఎలాగయినా ఈ రోజు మీతో మాట్లాడమని స్కూల్లో చెప్పారు. నేను మర్చిపోతాననేమోనని... మళ్ళీ ఇప్పుడే ఫోన్'' చిన్నగా నవ్వుతూ అంది. ''అబ్బాయిని ఇంటికి రమ్మనమని ఫోన్ చెయ్'' అంటూ సోఫాలోంచి లేచాను. ''ఇప్పుడా!'' ఆశ్చర్యంగా అడుగుతున్న మున్నీవైపు చూస్తూ,'' మంచి పనికి ముహూర్తాలు అవసరం లేదని మీ అమ్మ చెప్పేది'' అని చిన్నగా నవ్వుతూ నా గదిలోకి కదిలాను.

స్నానం చేసి, బట్టలు మార్చుకుని వచ్చేసరికి, ముందు గది రూపురేఖలన్నీ మారిపోయి ఉన్నాయి. సోఫాకవర్, ఫ్లవర్‌వాజ్‌లో పూలు, కిటికీలకున్న కర్టెన్స్ అన్నీ కొత్తగా ఉన్నాయి. గది అంతా చాలా అందంగా, ఆహ్లాదంగా ఉంది. నేను ఆశ్చర్యపోయాను. ఏదైనా ఫంక్షన్స్‌కి వెళ్ళేప్పుడు చీర కట్టుకోమంటే మొండికేసే మా అమ్మాయి. చీర కట్టుకుని వాకిట్లో నిల్చొని ఉండడం చూసి!. ఈ అలంకరణే చెబుతోంది., తను ఆ అబ్బాయిని ఎంతగానో ఇష్టపడుతోందని. సోఫాలో కూర్చుని పేపర్ చదవడంలో మునిగిపోయిన నేను ''నాన్నా.. శ్రీరామ్'' అన్న మున్నీ పిలుపుతో తలపైకెత్తి ''నమస్కారమండీ'' అంటూ రెండు చేతులూ జోడిస్తున్న ఆ కుర్రవాడ్ని చూసి ఉలిక్కిపడ్డాను. ఈ కుర్రవాడే ఆరోజు విశ్వనాథం ఉద్యోగం పోవడానికి., ఆ బస్‌స్టాప్‌లో కుర్రాళ్లను కొట్టింది., బార్‌లో స్నేహితులతో కనిపించింది ఈ కుర్రాడే!


ఒక నిర్ణయాని కొచ్చినట్టుగా, ''మున్నీ ఈ అబ్బాయి నాకు నచ్చలేదు., పంపించెయ్..'' అని పొడి పొడిగా చెప్పేసి, నా గది లోపలికి వెళుతూ.., ఆ అబ్బాయి వైపు చూసాను. అదే చిరునవ్వుతో బయటకు వెళ్ళిపోతూ.. అతను.., ఆ వెనుకగా మా అమ్మాయి. నా మనసెందుకో చివుక్కుమంది.

***

వారం రోజులు గడిచిపోయాయి. మున్నీ మామూలుగానే రోజూ స్కూల్‌కి వెళ్ళి, వస్తోంది. నాతో కూడా మునుపటిలానే ఉంది. అసలు ఏం జరగనట్టు! నిజం చెప్పొద్దూ.. ఆ రోజు శ్రీరామ్‌ని పంపించెయ్యమని చెప్పినప్పట్నుంచి..., ఈ రోజు వరకు తను ఆ విషయం ప్రస్తావిస్తుందేమో..!, ''అతను నువ్వనుకున్నంత మంచి వాడు కాదు., నీకు అతను సరిపోడు..'' అని చెప్పాలనుకున్నాను. కానీ, ఆ ప్రస్తావనే రావట్లేదు. ఎందుకో.., మున్నీ మనసులోనే బాధపడుతున్నట్టు నాకనిపించింది. నాకెందుకో గిల్టీగా కూడా అనిపిస్తోంది.

మున్నీకి పదేళ్ళున్నప్పుడు నా భార్య చనిపోయింది. అప్పట్నుంచి తనకి ఏ లోటూ రాకుండా, ఏ కష్టం తెలియకుండా పెంచాను. తనకేది ఇష్టమంటే అదే చేసాను., ఏం చదువుతానంటే అదే చదివించాను. బి.ఇడి అయినాక ఖాళీగా ఉండడమెందుకని ఉద్యోగం చేస్తానని ఓ ప్రయివేట్ స్కూల్లో చేరుతానన్నా ఒద్దన లేదు. అప్పుడు ఒద్దనకపోవడం వల్లనేమో.!, జీవితంలో ఎంతో ప్రాముఖ్యత కలిగిన పెళ్ళి విషయంలో ఇప్పుడిలా తన ఇష్టాన్ని కాదనాల్సి రావడం.! నాకూ బాధగానే ఉంది.

''నాన్నా.. టీ'' అంటూ వచ్చిన మున్నీని కూర్చోమని చెపుతూ., టీ గ్లాస్ అందుకుని ''మున్నీ.., శ్రీరామ్



విషయంలో నేనలా ప్రవర్తించినందుకు, నీకు బాధ కలిగి ఉండవచ్చు., కానీ., అతను చాలా ఆవేశపరుడు. గొడవలుపడడం... ఎదుటివాళ్ళను కొట్టడం., నేను కూడా చాలా సార్లు చూశాను.'' అంటూ ఆరోజు విశ్వనాథం విషయం దగ్గర్నుంచి అతన్ని బార్‌లో చూసినంత వరకూ జరిగినదంతా చెప్పి ఖాళీగ్లాసు క్రిందపెట్టాను. నా మనసులో ఉన్న భారమంతా తొలగిపోయింది. ముఖ్యంగా కారణం లేకుండా నేనలా ప్రవర్తించలేదన్న సంగతి మున్నీకి స్పష్టం చేసినందుకు. సోఫాలో రిలాక్స్‌గా వెనక్కివాలి తనవైపు చూసాను.., తనేం చెపుతుందా? అన్నట్టు.

''ఇదంతా., నాకు ముందే తెలుసు నాన్నా.!'' మున్నీ మెల్లగా అన్న ఆ మాటలు నావైపు బాణాల్లా దూసుకు వచ్చాయి. నాకేమీ అర్థంకాలేదు. ''అంటే?'' అన్నాను అయోమయంగా. ''విశ్వనాథం అంకుల్ విషయం కానివ్వండి., బస్‌స్టాప్‌లో రోమియోలను కొట్టడం గానివ్వండి ఇవేవీ ఆయన నా దగ్గర రహస్యంగా ఉంచలేదు నాన్నా.!, ఆఖరికి మీరు బార్‌లో చూసారన్నారే., అది కూడా.!'' మెల్లగా సోఫా దగరగా వచ్చి నాప్రక్కనే కూర్చుని.., ''నాన్నా.. ఆ రోజు మీ ఆఫీస్‌లో జరిగిన సంగతి నాకు చెప్పినప్పుడే.., మీ గురించీ చెప్పారు. వీడియోని మీ ముందు డిలీట్ చేయక ముందే.., దాన్ని టీవీ ఛానెల్‌కి పంపారు. కానీ మీకా విషయం చెప్పకుండా.. మోసం చేసానేమోనని అతను బాధ పడ్డారు. అప్పుడు మీరే నా తండ్రన్న సంగతి అతనికి తెలియదు. ఆ రాత్రి మీరు చెబితేనే., ఆ వ్యక్తి మీరని నాకూ తెలిసింది. ఇక రోమియోలను కొట్టడమంటారా.., ఆ ఆడపిల్లల స్థానంలో నేనున్నా మీరిలానే అనేవారా?, మీకు లానే త్రాగే వాళ్ళంటే ఆయనకు చాలా చికాకు. కానీ పుట్టిన రోజు పార్టీ అని వాళ్ళు బలవంతం చేస్తుంటే.. ఈ ఒక్కసారికే అని నేను చెబితేనే ఆయన ఆ రోజు బార్‌కి స్నేహితులతో వెళ్ళారు. ఇందులో తప్పేముంది నాన్నా.!''

ప్రశాంతంగా పిల్లలకు పాఠాలు చెపుతున్నట్టుగా.., ఉన్న ఆ మాటలను మౌనంగా వింటున్నాను. ''ఏ ఆడ పిల్లకయినా తండ్రే మొట్టమొదటి ఆదర్శపురుషుడు. ఒక మగాడు ఎలా ఉండాలో., ఎలా ఉండకూడదో అక్కడే తెలుసుకుంటుంది. అమ్మ పట్ల మీకున్న ప్రేమ.., నాపై ఉన్న బాధ్యత., ఉద్యోగ జీవితంలో మీ నిజాయితీ.., ఎదుటి వాళ్ళను నొప్పించకూడదనుకునే మీ సంస్కారం., వ్యక్తిగతమైన విలువలు., ఇలా మీలో ఉన్న ఎన్నో లక్షణాలను నేను శ్రీరామ్‌లో చూశాను. అందుకేనేమో., అతన్ని ఇష్టపడ్డాను. ఆ ఇష్టం కూడా.., మిమ్మల్ని కాదని, అతన్ని పెళ్ళి చేసుకునేంతకాదు. మీకు నచ్చితేనే..'' ఇక చెప్పడానికేమీ లేదన్నట్టుగా ఖాళీగ్లాసులు తీసుకుని వంటగదిలోకి వెళ్తూ ఆగి వెనక్కు తిరిగి.., ''నాన్నా.., నిజానికి మీ రూపాలు వేరేమో., కానీ.., భావాలు మాత్రం ఒక్కటే.! అతనితో మాట్లాడే ప్రతిసారి.. అతనిలో నువ్వే నాకు కనిపిస్తావు. ఇవన్నీ చెపుతున్నది... మిమ్మల్ని కన్విన్స్ చేయడానికి కాదు.! అతను మీరనుకుంటున్నట్టు చెడ్డవాడు మాత్రం కాదు.. అని చెప్పటానికే..'' వెళుతున్న మున్నీనే చూస్తూ ఉండిపోయాను. నాకు చాలా గర్వంగా అనిపించింది. తను చెప్పాలనుకున్న విషయాన్ని సూటిగా.. స్పష్టంగా చెప్పడం. ప్రేమించినవాడే సర్వస్వం అనకుండా నిర్ణయం నాకే వదిలేయడం. సిగరెట్ తీసి వెలిగించాను.!, శ్రీరామ్ గుర్తొచ్చాడు., అతనితోపాటు ఆ పెదవులపైన చిరునవ్వు, ఆ కళ్ళలో కనిపించే ధైర్యం. ఇన్నాళ్ళు అతని గూర్చి ఎంత తప్పుగా అర్థం చేసుకున్నానో., అనిపిం చింది. విశ్వనాథం విషయం కానీ, ఆ రోమియో కుర్రాళ్ళ సంగతి కానీ., అతను చేసింది న్యాయమే.., నిజానికి ఈ రెండు సంఘటనల్లో నాక్కూడా వాళ్ళను కొట్టాలన్నంత కోపమొచ్చింది., కానీ నాకంటే ముందు శ్రీరామ్ ఆ పనిచేయడంతో.. నాకతని మీద కలిగిన ఈర్ష్య అతన్ని చెడుగా అర్థం చేసుకునేట్టు చేసింది. ఒకప్పుడు నేనూ అలానే ఉండేవాడిని. ఆ వయసులో నాకు ఒప్పనిపిం చింది.. ఈ వయసులో నాకు తప్పనిపించింది. అయినా ఈ విషయంలో ఇంక వేరే ఆలోచనలు అనవసరం. ఈ తరం పిల్లలు తమకు ఏది మంచో.., ఏది చెడో., నిర్ణ యించుకోగల స్థాయిలో ఉన్నారు. వాళ్ళ చదువులూ, వాళ్ళ ఉద్యోగాలు. వివాహాలు., వాళ్ళ భవిష్యత్తంటూ మనం హైరానా పడటం... బి.పి. పెంచుకోవడం అనవ సరం. నిజంగా ఏదైనా సమస్యలు ఎదురైనా వాళ్ళు వాటిని చక్కగా పరిష్కరించుకోగలరు కూడా.!. ''ఏం కూర చేయాలి నాన్నా?'' అన్న మున్నీ ప్రశ్నకు ''శ్రీరా మ్‌కు ఏది ఇష్టమో అదిచెయ్.! అలాగే, భోజనానికి రమ్మని కూడా ఫోన్ చేయి'' అన్నాను. ''ఇప్పుడా?'' ఆశ్చర్యంగా అంటున్న మున్నీతో ''మంచి పనికి ముహూర్తాలు అవసరం లేదని మీ అమ్మ చెప్పేది..'' చిన్నగా నవ్వుతూ అన్నాను. తను కూడా నవ్వింది ప్రపంచంలో ఉన్న సంతోషమంతా తన నవ్వులో కనపించేలా.!

*